మరో గురువాయణం పుస్తకావిష్కరణ

బేగంపేట్, డిసెంబర్ 7: బేగంపేట్ సన్‌షైన్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ గురువారెడ్డి రచించిన 'మరో గురువాయణం' అనే పుస్తకాన్ని శనివారం ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆవిష్కరించారు. డాక్టర్ గురువారెడ్డి మాట్లాడుతూ.. 'మరో గురువాయణం' అనేది నా ఆత్మ కథ కాదు అనుభవాల సంకలనం అని, 2011లో మొదటి ప్రచురణతో గురువాయణం మొదటి సంచిక ఆరుసార్లు ముద్రించి 18 వేల కాపీలను ఉచితంగా అందజేసినట్టు తెలిపారు. ప్రస్తుతం మరో గురువాయణంలో 'నా జీవితంలో అత్యంత ప్రభావితం చేసిన వ్యక్తులు, నా చిన్ననాటి జ్ఞాపకాలు, తాను చదివిన, మెలిగిన ప్రయాణాన్ని గుర్తు చేస్తూ నచ్చిన రచనలు పొందుపరిచినట్టు తెలిపారు.

రాజీవ్‌గాంధీ పార్కు ఆధునీకరణకు చర్యలు

సిటీబ్యూరో, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా బీఎన్‌రెడ్డి నగర్‌లోని రాజీవ్‌గాంధీ పార్కు ఆధునీకరణకు హెచ్‌ఎండీఏ చర్యలు చేపట్టింది. పార్కులో మౌలిక వసతుల్లేక సందర్శకులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో స్థానికుల ఫిర్యాదు మేరకు అభివృద్ధి పనులకు హెచ్‌ఎండీఏ చర్యలు చేపట్టింది. రూ. ఐదున్నర లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నారు. పార్కు పరిధిలో ప్రవేశ మార్గం, వాకింగ ట్రాక్, టాయిలెట్లు, సైన్ బోర్డులు, చెత్త కుండీలతోపాటు సందర్శకుల కోసం మరికొన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా పార్కు పరిధిలో లైటింగ్ కోసం సన్నాహాలు చేస్తున్నట్లు హెచ్‌ఎండీఏ వర్గాలు పేర్కొన్నాయి. గడిచిన ఆరేడు నెలలుగా పార్కులో లోపించిన పనులపై సందర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర కురుమ ఆత్మగౌరవ భవనం 14న ప్రారంభం

మణికొండ, డిసెంబర్ 7: తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా కోకాపేట నియోపోలీస్‌లో నిర్మించిన దొడ్డి కొమురయ్య కురుమ కుల ఆత్మగౌరవ భవనాన్ని ఈనెల 14వ తేదీన ప్రారంభించనున్నట్లు రాష్ట్ర కురుమ సంఘ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కురుమ తెలిపారు. శనివారం కోకాపేటలోని కురుమ ఆత్మగౌరవ భవనం వద్ద ఆయన వివిధ శాఖల అధికారులు, రాష్ట్ర కురుమ సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్, భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్ కురుమ, సంఘ ప్రతినిధులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం వివిధ జిల్లాలోని గ్రామగ్రామాల నుంచి వేలాది మంది కురుమలు ఈ భవన ప్రారంభోత్సవంలో పాల్గొంటారని వివరించారు. ఇందుకు ప్రత్యేక ఏర్పాట్లు, భోజన వసతులు, సమావేశ ప్రాంగణ ఏర్పాట్ల గురించి అధికారులతో చర్చించి, పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ భవన ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి, కర్నాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కురుమ, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కురుమ, ఆల్ ఇండియా పాల్ మహాసభ అధ్యక్షుడు సైతాన్‌సింగ్ పాల్, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, కర్నాటక మాజీ మంత్రి హెచ్.ఎం.రేవణ్ణ, చేవెళ్ల మాజీ ఎంపీ డా.గడ్డం రంజిత్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌తో పాటు వివిధ జిల్లాలకు చెందిన అధికారులు, అనధికార ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ సంధ్య, ఆర్డీవో వెంకట్‌రెడ్డి, ఏసీపీ రమణాగౌడ్, రాష్ట్ర కురుమ సంఘ నాయకులు బండారు నారాయణ, కౌలుపుల నర్సింహ, పెండ్యాల శ్రీనివాస్, తూంకుంట అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 7: షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెలమ సామాజిక వర్గంపై చేసిన అనుచిత వ్యాఖ్యలను విరమించుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డిమాండ్ చేశారు. శనివారం కూకట్‌పల్లిలో మాట్లాడుతూ.. ఓ శాసనసభకు ప్రాతినిథ్యం వహిస్తున్న వీరపల్లి శంకర్... వెలమ సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ పాలనలో కొన్ని సామాజిక వర్గాలపై కాంగ్రెస్ పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, ఈ వ్యాఖ్యలు చేసిన వారిపై కాంగ్రెస్ పార్టీ కానీ, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు కానీ చర్యలు తీసుకోవడం లేదన్నారు. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డే ఓ సామాజిక వర్గం నేతలను బుల్డోజర్స్‌తో తొక్కిస్తానని, నల్లగొండలో రెడ్డి సామాజిక వర్గంపై కొందరు నేతలు, ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు వస్తే... మాలలతో మాదిగలను తిట్టించడం కాంగ్రెస్ పార్టీ నేతలకు అలవాటుగా మారిందన్నారు. ఎమ్మెల్యే శంకర్ చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సమాధానం చెప్పాలన్నారు. ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమా? కాంగ్రెస్ పార్టీ వైఖరా? అనేది ప్రకటించాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్ చేసిన పోరాటం వల్లే... ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్న విషయం మర్చిపోవద్దన్నారు. తాను కూకట్‌పల్లిలో అన్ని సామాజిక వర్గాలు, మతాలు, ప్రాంతాల వారు అదరించడం వల్లే మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని, అందరినీ గౌరవించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న వెలమ సామాజిక వర్గం ఎమ్మెల్యేలు కూడా ఈ వ్యాఖ్యపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే శంకర్ బేషరతుగా మాటలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని, లేకుంటే లక్షల మందితో ఉద్యమాలు చేయాల్సి వస్తుందన్నారు. ఎమ్మెల్యే శంకర్ చేసిన వ్యాఖ్యలపై శాసనసభ స్పీకర్, డీజీపీ, ఎన్నికల కమిషనర్, గవర్నర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఎస్టీల సమస్యలు మండలిలో ప్రస్తావించండి

- ఎమ్మెల్సీ కవితకు వినతి

సిటీబ్యూరో, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిసి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. జరుగబోయే మండలిలో తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు నాయకత్వంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూతాడి రవి కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోనేటి నరసింహ, రాష్ట్ర కోశాధికారి వనం రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కూతాడి సురేష్, కేతిరి రాజశేఖర్, దేవరాజు యాదగిరి, బాణాపురం శ్రీరాములు, లోకిని సమ్మయ్య, మానుపాటి రమేష్, ఓని సదానందం, ఎల్బీనగర్ రవి, శివ, సతీశ్, ప్రసాద్, యాదగిరి పాల్గొన్నారు.

జనవరి లోగా ఎస్టీపీలు సిద్ధం కావాలి

సిటీబ్యూరో, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ): జనవరి నాటికి నగరంలో సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణం పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని వాటర్ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న ఎస్టీపీల పనులను శనివారం సమీక్షించారు. ఎస్టీపీల నిర్మాణానికి సరిపడా కార్మికులు లేకుండా పనులు ఆలస్యం చేయడంతో నిర్మాణ సంస్థలపై అసహనం వ్యక్తం చేశారు. వివిధ దశల్లో ఉన్న ఎస్టీపీలన్నింటిని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఇప్పటికే 11 ఎస్టీపీలను ప్రారంభించగా, మరో 9 నిర్మాణ దశలో ఉన్నాయి.

బంజారాహిల్స్‌లోని ఎల్వీ ప్రసాద్ క్యాంపస్‌లో జాతీయ సదస్సులో పాల్గొన్న నిపుణులు

వైద్యంలో పేద, ధనిక తేడా ఉండొద్దు

- ఎల్వీపీఈఐలో జరిగిన జాతీయ సదస్సులో వైద్య నిపుణులు

బంజారాహిల్స్, డిసెంబర్ 7: పేద, ధనిక అనే తేడాలేకుండా సమానమైన వైద్యాన్ని అందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సదస్సులో వైద్య నిపుణులు పేర్కొన్నారు. దేశంలో వైద్య రంగంలో అసమానతలను తొలగించి అందరికీ నాణ్యమైన వైద్య సేవలందించేందుకు తీసుకువాల్సిన చర్యలు, రోగి హక్కులు, హెల్త్‌కేర్ రంగంలో పాటించాల్సిన నైతిక పద్ధతులపై రెండురోజుల పాటు బంజారాహిల్స్‌లోని ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రిలో నిర్వహించిన జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఎల్వీప్రసాద్ వైద్యవిజ్ఞాన సంస్థ, ఫెర్నాండెజ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఐఎస్‌బీ, ఐఐఎం ఉదయ్‌పూర్, సెంటర్ ఫర్ హెల్త్‌కేర్, సెయింట్ జాన్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, అరవింద్ ఐ కేర్ సిస్టమ్ తదితర సంస్థల నుంచి నిపుణులు హాజరై ప్రస్తుతం వైద్య రంగంలో ఉన్న పరిస్థితులను, కార్పొరేట్ వైద్యం పేరుతో విపరీతమైన ఖర్చుతో రోగులు పడుతున్న ఇబ్బందులపై చర్చించారు. ఈ సదస్సులో ఎల్వీపీఈఐ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డా.ప్రశాంత్ గార్గ్, ఫెర్నాండెజ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ డా. ఎవిటా ఫెర్నాండెజ్, ఈహెచ్‌ఏసీ చైర్మన్ ప్రొ. డీవీఆర్.శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

అబ్కారీ చట్టాలు ఉల్లంఘిస్తే ఉపేక్షించం

- ఫామ్‌హౌస్ నిర్వాహకులు ఎక్సైజ్ నియమాలు పాటించాలి
- మాముళ్లు డిమాండ్ చేస్తే సమాచారం ఇవ్వండి.. చర్యలు తీసుకుంటాం
- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి

సిటీబ్యూరో, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ): మాముళ్ల కోసం వేధించే అధికారులు, సిబ్బందిని ఉపేక్షించబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి అవకతవకలకు పాల్పడే సిబ్బందిని హెచ్చరించారు. 'ఎక్సైజ్ లక్ష్యం ఫామ్‌హౌస్‌లే' అనే శీర్షికన శనివారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించి వివరణ ఇచ్చారు. అబ్కారీ చట్టం ప్రకారమే కేసులు నమోదు చేస్తున్నామని, కమర్షియల్ లేదా పబ్లిక్ ప్లేసెస్, ఫామ్‌హౌస్‌లు, ఫంక్షన్‌హాళ్లలో మద్యంతో కూడిన పార్టీలు చేసుకుంటే క్వాంటిటీతో సంబంధం లేకుండా కచ్చితంగా ఎక్సైజ్ అనుమతి తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. అంతే కాకుండా నాన్ డ్యూటీ పెయిడ్, అక్రమ విదేశీ మద్యం వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫామ్‌హౌస్‌ల నిర్వాహకులు అబ్కారీ నియమాలు పాటించి అధికారులకు సహకరించాలని సూచించారు. ఎవరైనా సిబ్బంది మాముళ్ల కోసం వేధించినా, మాముళ్లు ఇవ్వని వారిపై అక్రమ కేసులు బనాయించినా వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని, బాధితుల వివరాలు గోప్యంగా ఉంచడంతోపాటు అక్రమాలకు పాల్పడే అధికారులు, సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అబ్కారీ ఈడీ స్పష్టం చేశారు.

మూసీలో పోసిన మట్టిని వెంటనే తొలగించాలి

- నిర్మాణ సంస్థలపై హైడ్రా కమిషనర్ ఆగ్రహం
- మంచిరేవుల, అల్కాపురి ప్రాంతాల్లో పర్యటన

మంచిరేవుల మూసీ పరివాహక ప్రాంతాన్ని పరిశీలించి స్థానికులతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

సిటీబ్యూరో, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ): మంచిరేవుల వద్ద మూసీ నది పరివాహక ప్రాంతంలో పోసిన మట్టిని వెంటనే తొలగించాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పలు నిర్మాణ సంస్థలను ఆదేశించారు. నది పరివాహకంలో ఎలా మట్టి పోస్తారంటూ ఆదిత్య, ఎన్‌సీసీ, రాజపుష్ప నిర్మాణ సంస్థలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మంచిరేవుల వద్ద మూసీ పరివాహక ప్రాంతాన్ని రంగనాథ్ పరిశీలించారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండల పరిధిలోని మణికొండ మున్సిపాలిటీ అల్కాపురి టౌన్‌షిప్‌లో అనుహర్ హోమ్స్ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన మార్నింగ్ రాగా గేటెడ్ కమ్యూనిటీని రంగనాథ్ సందర్శించారు. రాగా గేటెడ్ కమ్యూనిటీలో రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని కమర్షియల్‌గా వినియోగించడంపై స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు రంగనాథ్ క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానిక మున్సిపల్ కమిషనర్‌తోపాటు నివాసితులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను విచారించారు. రెసిడెన్షియల్ అనుమతులు తీసుకున్న ప్రకారమే నిర్మాణాన్ని ఉంచాలని, ఎలాంటి వ్యాపార లావాదేవీలు జరకుండా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు. అక్రమ నిర్మాణాలు, వినియోగంపై తెలంగాణ మున్సిపల్ యాక్ట్ సెక్షన్ 178(2) ప్రకారం హైడ్రాకు సమకూరిన అధికారాల మేరకు హైడ్రా తనిఖీలు చేపట్టిందని కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా రాగా కమ్యూనిటీలో గ్రౌండ్‌ఫ్లోర్‌ను కమర్షియల్‌గా మార్చిన పక్షంలో నిర్మాణ సామర్థ్యం సరిపోదని ఆయన సూచించారు. అనుమతుల మేరకే భవనం వినియోగం ఉండాలని, అనుహర్ హోమ్స్ అనుమతుల పత్రాలు పరిశీలించి చర్యలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీరం చెరువును వివిధ శాఖల అధికారులతో కలిసి రంగనాథ్ పరిశీలించారు. చెరువు అలుగు వెళ్లే మార్గంలో డ్రైన్ బాక్స్‌ను నిర్మాణం చేయాలని నిర్మాణ సంస్థకు ఆదేశాలిచ్చారు.

పీరం చెరువును పరిశీలించిన రంగనాథ్

బండ్లగూడ, డిసెంబర్ 7: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటించారు. శనివారం ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి కార్పొరేషన్ పరిధిలోని పీరం చెరువును పరిశీలించారు. ఇటీవల కాలంలో పీరం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అనేక నిర్మాణాలు వెలుస్తున్న విషయం అందరికీ తెలిసిందే. పీరం చెరువును సందర్శించడంతో ప్రజల్లో అనేక అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. చెరువు చుట్టూ వెలిసిన అక్రమ నిర్మాణాలను తొలగిస్తారా? లేక అనుమతులు ఉన్నాయని వదిలేస్తారా? అని ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

శాంత శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్‌కు వార్నింగ్

పీరం చెరువు అలుగు వెళ్లే ప్రాంతంలో శాంత శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్‌కు వారు నిర్మాణం చేపడుతున్నారు. కాగా, వారు ప్లానింగ్‌లో పేర్కొన్న మేరకు డ్రైన్ బాక్స్‌ను నిర్మించలేదు. కాగా, పీరం చెరువు అలుగును డ్రైన్‌బాక్స్ నిర్మాణాన్ని 15 రోజుల్లో చేపట్టాలని, లేదంటే అనుమతులు రద్దు చేస్తామని వార్నింగ్ ఇచ్చారు.

ఘనంగా సీఆర్ఐఐ సెమీ క్రిస్మస్

ఖైరతాబాద్, డిసెంబర్ 7: సివిల్ రైట్స్ ఇనిషియేటివ్ ఇంటర్నేషనల్ (సీఆర్ఐఐ) ఆధ్వర్యంలో శనివారం లక్డీకాపూల్‌లోని సెంట్రల్ కోర్టు హోటల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సీఆర్ఐఐ అధ్యక్షుడు, మధ్యప్రదేశ్ మాజీ డీజీపీ డాక్టర్ కె.బాబూరావు ఐపీఎస్ మాట్లాడుతూ.. దేశంలో పౌర హక్కుల కోసం తమ సంస్థ చేస్తున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. దేశంలో అనేక చోట్ల మత ఉన్మాదం పెచ్చుమీరుతున్నదని, మైనార్టీలపై యధేచ్ఛగా దాడులు జరుగుతున్నాయని, వీటిని నివారించేందుకు ఆయా రాష్ట్రాల పోలీసు వ్యవస్థలతో కలిసి పని చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ వార్తా సంస్థలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా ఫీచర్స్ ఎడిటర్ సుశీల్‌రావు, ది హిందూ పత్రిక రెసిడెంట్ ఎడిటర్ రవిరెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం విభాగం మాజీ డీన్ స్టీవెన్‌సన్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కమిషన్ చైర్మన్ దీపక్ జాన్ తదితరులు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఆర్ఐఐ బ్రోచర్‌ను విడుదల చేశారు.

ఘనంగా హరికథా మహోత్సవాలు

భక్తప్రహ్లాద హరికథను గానం చేస్తున్న భాగవతారిణి వై.శిఖామణి

సిటీబ్యూరో, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ): హరికథా పితామహ ఆదిభట్ల నారాయణదాస 160వ, వారి ప్రియశిష్యుడు నేతి లక్ష్మీనారాయణభాగవతుల 126వ జయంతి హరికథా మహోత్సవాలు నల్లకుంటలోని శ్రీశృంగేరి శంకరమఠం ప్రాంగణంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అన్నమయ్య పరివారం తరపున యనమండ్ర వెంకటకృష్ణయ్య, నేతి కుటుంబం నుంచి శ్రీనివాస్, చావలి కామేశ్వర్‌రావు దంపతులు, ఉమాదేవి, శారద పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ.. హరికథ పేరు వింటే నారాయణదాసు గుర్తుకు వస్తారని, పుంభావసరస్వతిగా పేరొందిన నారాయణదాస్ నవరసభరితముగా కథాగానం చేయడంలో అందెవేసిన చేయి అని కొనియాడారు. ఈ సందర్భంగా డాక్టర్ పాణ్యం దక్షిణామూర్తి వయోలిన్‌పై, ఆర్.సుధాకర్ మృదంగంపై వాద్యసహకారం అందించగా, రామచంద్రాపురానికి చెందిన భాగవతారిణి వై.శిఖామణి భక్తప్రహ్లాద హరికథాగానం చేసి సభికులను అలరించారు. ఆదివారం జి.మునిలక్ష్మి భాగవతారిణిచే భక్తమార్కండేయ హరికథాగానం ఉంటుందని పర్యవేక్షకులు బుర్రా పద్మనాభ శర్మ తెలిపారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయం



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాగంటి

జూబ్లీహిల్స్, డిసెంబర్ 7: జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ పేర్కొన్నారు. శనివారం రహ్మత్‌నగర్ డివిజన్‌కు చెందిన 10 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.3,18,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను డివిజన్‌లోని శ్రీరాంనగర్ కూడలిలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధితోపాటు అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నానన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలు అత్యంత ప్రజాదరణ పొందాయన్నారు. ఆయా పథకాలను ప్రతి ఇంటికి, ప్రతి గడపకూ అందేలా కృషి చేయడంలో నాయకులు, కార్యకర్తల కృషి ఎనలేనిదన్నారు. అన్ని కార్యక్రమాల్లో ముందుండే మహిళలతోపాటు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేసి పార్టీకి పూర్వవైభవం తేవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఫయాజ్, బషీర్, లియాకత్, చోటు, అరుణ్, రాకేశ్, సమద్, అహ్మద్, సురేందర్, వాజీద్, అర్షద్, కె.ఎన్.రెడ్డి, ధనూజ, స్రవంతి, బేగం, యాదమ్మ, గని, జగ్గు, వినోద్, తరుణ్, రఘు, విజయ్, యూనుస్, జావీద్, అస్లాం, ఇతర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల మల్లేశ్, పోటు ప్రసాద్ సేవలు చిరస్మరణీయం

ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

హిమాయత్‌నగర్, డిసెంబర్7: నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పార్టీకి, సమాజానికి సీపీఐ నేతలు ఎన్.బాల మల్లేశ్, పోటు ప్రసాద్ అందించిన సేవలు చిరస్మరణీయని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు, ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన బాల మల్లేశ్, పోటు ప్రసాద్ సంస్మరణ సభ శనివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో జరిగింది. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలి ఉల్లాఖాద్రీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్రాంతికుమార్ అధ్యక్షతన జరిగిన సభకు వారు హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యల పరిష్కారానికి బాల మల్లేశ్, పోటు ప్రసాద్ ఎంతో కృషి చేశారని, వారి మరణం వామపక్ష ఉద్యమాలకు తీరనిలోటని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.లక్ష్మణ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్, ఉపాధ్యక్షులు టి.సత్యప్రసాద్, శ్రీమాన్, నేతలు గ్యార నరేశ్, నాగజ్యోతి, రెహ్మాన్, బాలకృష్ణ, ఆలేటి యాదగిరి, గుర్రం రాజశేఖర్‌రెడ్డి, సల్మాన్ బేగ్, కల్యాణ్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మల్లేశ్ మరణం తీరని లోటు..

శంషాబాద్ రూరల్:సీపీఐ రాష్ట్ర నాయకుడు బాలమల్లేశ్ మరణం విప్లవోద్యమాలకు తీరనిలోటని ప్రొఫెసర్ హరగోపాల్ పేర్కొన్నారు. శనివారం శంషాబాద్ పట్టణంలోని ఓ హోటల్‌లో సీపీఐ రాష్ట్ర నాయకుడు బాల మల్లేశ్ సంతాపసభ నిర్వహించారు.కార్యక్రమంలో బీకేఎంయూ జాతీయ ప్రధాన కార్యదర్శి నిర్మల్ పాండే, జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, కాంతయ్య, వెంకటరాములు, పుస్తకాల నర్సింగ్‌రావు, పానుగంటి పర్వతాలు, మండల కార్యదర్శ నర్రగిరి, ప్రభులింగం, నాయకులు పాల్గొన్నారు.

రూ.1.75కోట్ల డ్రగ్స్, గంజాయి దహనం

సిటీబ్యూరో, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ ఎక్సైజ్ యూనిట్ పరిధిలోని ధూల్‌పేట, నాంపల్లి, ముషీరాబాద్ అబ్కారీ స్టేషన్లకు చెందిన 187 కేసుల్లో పట్టుబడిన రూ.1.75 కోట్ల విలువ చేసే 621కిలోల గంజాయి, 101కిలోల పాపిష్ట, 0.4కిలోల భంగ్, 46గ్రాముల ఎండీఎంఏ, 108ఎల్ఎస్‌డి బ్లాస్టలను హైదరాబాద్ డీసీ కేఏబీ శాస్త్రీ ఆదేశాల మేరకు షాద్‌నగర్ ప్రాంతంలోని మల్టీకావ్ ప్రై.లిలో అబ్కారీ అధికారులు దహనం చేశారు.

స్థలం కేటాయింపును వెనక్కి తీసుకోవాలి

అంబేద్కర్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ.ఘంటా చక్రపాణికి వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నేతలు

బంజారాహిల్స్, డిసెంబర్ 7: డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన 10 ఎకరాల స్థలాన్ని జేఎన్ఏఎఫ్ఏయూకు కేటాయించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా చూడాలని యూనివర్సిటీ ఉద్యోగుల జేఏసీ నేతలు కొత్తగా నియమితులైన ఓపెన్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ.ఘంటా చక్రపాణిని కోరారు. శనివారం వీసీగా బాధ్యతలు స్వీకరించిన ప్రొ.చక్రపాణిని కలిసిన జేఏసీ చైర్‌పర్సన్ ప్రొ.పల్లవీ కాబ్డే, కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్‌తోపాటు ఇతర నేతలు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు డా.వేణుగోపాల్‌రెడ్డి, రవీంద్రనాథ్ సోల్మన్, డా.ఎల్వీకే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హరేకృష్ణ మూవ్‌మెంట్‌కు ఎలక్ట్రిక్ వాహనం విరాళం



హరేకృష్ణ మూవ్‌మెంట్‌కు ఎలక్ట్రిక్ వాహనం అందజేస్తున్న ఎల్ఐసీ గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ ప్రతినిధులు

బంజారాహిల్స్, డిసెంబర్ 7: ఎల్ఐసీ గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ సీఆర్ఆర్ కార్యక్రమంలో భాగంగా బంజారాహిల్స్‌లోని హరేకృష్ణ మూవ్‌మెంట్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల కోసం రూ.16 లక్షల విలువైన ఎలక్ట్రిక్ వాహనాన్ని విరాళంగా అందజేశారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో 'అక్షయ పాత్ర' పేరుతో పేదలకు ఆహారాన్ని అందిస్తున్నందున వారికి చేయూతనిచ్చేందుకు తమ వంతుగా పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ వాహనాన్ని అందజేస్తున్నామని ఎల్ఐసీ జోనల్ మేనేజర్ పునీత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఉపాధ్యక్షుడు మహ విష్ణుదాస ప్రభు, ఎల్ఐసీ ప్రతినిధులు జీబీవీ.రామయ్య. మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.